క్లుప్తంగా

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దేవరకొండ : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు దేవరకొండ ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల మండల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో విధిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో పలు మండల పరిధిలో గల అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

హాలియా : అనుముల మండలంలోని నాయుడుపాలెంలోని పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం 14వ వార్షికోత్సవ మహోత్సవ పూజలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వార్షికోత్సవ మహోత్సవ పూజలో తొలి రోజు ఆలయ పురోహితులు రమేష్ శర్మ, రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్య కవచాలు, మండపారాధన, కలశ స్థాపన, అభిషేకాలు, తదితర పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు.

చింతపల్లిలో తాగునీటి కష్టాలు

చింతపల్లి : 15 రోజులుగా కృష్ణా జలాల సరఫరా నిలిచిపోవడంతో చింతపల్లి ఎక్స్ రోడ్డు వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్స్ రోడ్డు వద్ద పైప్‌లైన్ సప్లయ్ మాత్రం ఉండగా పదిహేను రోజుల నుంచి నిలిచిపోవడంతో ట్యాంకర్ల ద్వారా రూ.వెయ్యి వెచ్చించి విక్రయిస్తున్నారు. సంబంధిత గ్రామపంచాయతీ, మండల అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి కృష్ణా తాగునీటి సప్లై చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'ఉపాధి' కూలీలకు రోజు కూలి రూ. 600 ఇవ్వాలి

నల్లగొండ రూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి రోజు కూలి రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల సంఘం జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ రవీందర్‌రెడ్డికి ఉపాధి హామీ కూలీలతో కలిసి వినతిపత్రం అందజేసి ఆమె మాట్లాడారు. 200 రోజులకు పనిదినాలు పెంచి పట్టణ ప్రాంతాలకు విస్తరింపచేయాలని కోరారు. పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు 20 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కట్ట అంజయ్య, పనస చంద్రయ్య, శ్రీను, మారయ్య, శోభ ఉన్నారు.

'ఆకలి రహిత ప్రపంచం' లోగో ఆవిష్కరణ

మిర్యాలగూడ : ప్రపంచ ఆకలి దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మలబార్ గోల్డ్ సంస్థ కార్యాలయంలో 'ఆకలి రహిత ప్రపంచం' లోగోను కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలు ఆవిష్కరించారు. కరోనా కాలంలో టాటా వంటి సంస్థలు విరాళాలు ఇవ్వడం దేశభక్తికి నిదర్శనమన్నారు. వ్యాపార రంగంలో కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఇలియాస్, సికిందర్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

వేములపల్లి : కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి తండ్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సత్తిరెడ్డి అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్‌లు మంగళవారం సత్తిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు స్కైలాబ్‌నాయక్, నాయకులు ఎల్లారెడ్డి, కృపయ్య, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నగేష్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శ్రీమన్నారాయణ శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలో జూన్ 1న నిర్వహించే హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలని ఆ ఆలయ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో కోరింది. జయంతి సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు సభ్యులు తెలిపారు.

క్షేత్రపాలకుడికి ఘనంగా ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడికి మంగళవారం ఘనంగా ఆకు పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, క్షేత్రపాలకుడికి పంచామృతాలతో పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు

- తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- అక్రమ నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ కరువు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని డాక్టర్స్ కాలనీ..ప్రతి రోజు నిత్యం రోగుల తాకిడితో బిజీగా ఉండే ఆ రోడ్డు అసలే ఇరుకుగా ఉంటుంది. రోడ్డుకిరు వైపులా వాహనాలు నిలపడంతో మరింత ఇరుకుగా మారి.. ఆ రోడ్డుగుండా నడవాలంటేనే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఇరుకుగా ఉన్న రోడ్డు నడి మధ్యలో ఓ ఆస్పత్రి నిర్వాహకులు నీటి సంపు కోసం నాలుగు ఫీట్ల వెడల్పు ఎనిమిది ఫీట్ల లోతులో పెద్ద గుంటను తీసి గూణలు ఏర్పాటు చేసి నీటి సంపు కట్టారు. ఆ రోడ్డుగుండా ద్విచక్ర వాహనం వెళ్లాలంటేనే ఇబ్బందులు పడుతున్న జనం నడి రోడ్డు మధ్యలో నీటిసంపు తవ్వడంతో కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇది ఒక్క డాక్టర్స్ కాలనీలోకి వచ్చే ప్రజలు పడుతున్న ఇబ్బంది మాత్రమే కాదు ఇలా పట్టణంలో పలు వీధుల్లో నిర్మాణాలు జరుగుతున్న తీరు చూస్తే మున్సిపల్ అధికారుల పనితీరును అర్థం చేసుకోవచ్చు. ఇలా అయితే పట్టణం మరకొద్ది రోజుల్లో ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకోక తప్పదని మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో రోడ్డుపై నిర్మించిన నీటి సంపు

నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు

ప్రధాన వీధుల్లో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టింపులేకుండా ఉంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు కనీసం 6 ఫీట్లకు పైగా వదిలి వేసి కట్టడాలు చేపట్టాల్సి ఉండగా భవన యజమానులు రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో ఆ భవనాల మెట్లు రోడ్డు మిదనే ఉంటున్నాయి. ఆ భవనాల వద్ద వాహనాలు కూడా నిలపలేని స్థలం ఉండటంతో రోడ్లపై వాహనాలను నిలిపి ట్రాఫిక్ సమస్యకు దారి తీస్తున్నాయి. రోడ్లపై నిర్మాణాలు జరుగుతున్నా సంబధిత అధికారులు పట్టించుకోకపోవడంతోనే అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

అక్రమణలపై స్పెషల్ డ్రైవ్ చేపడుతాం

డాక్టర్స్ కాలనీలో రోడ్డుపై నీటి సంపు ఏర్పాటు చేశారనే విషం నా దృష్టికి రాలేదు. సంబధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటా. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. అలాంటి నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం.

– యూసుఫ్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

పట్టణంలో పలుచోట్ల..

- డాక్టర్స్ కాలనీలో నడి రోడ్డుపై నీటి సంపు నిర్మించినా మున్సిపల్ అధికారులకు పట్టడంలేదు.
- హెచ్‌పి గ్యాస్ కు వెళ్లే దారిలో ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వాహకులు నడి రోడ్డుపై విద్యుత్ ట్రాన్స్‌ఫర్మలను ఏర్పాటు చేసి రోడ్డుపైనే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా.. అధికారులు కనిపించకపోవడం ఏంటీ అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.
- చర్చిరోడ్డులో పలు భవనాల మెట్లు రోడ్డుపైనే నిర్మించడంతో ట్రాఫిక్ జాం అవుతుంది.

'భూముల వేలం ప్రకటన అవాస్తవం'

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి చెందిన భూములను వేలం వేస్తున్నట్లు వస్తున్న ప్రకటనలు అవాస్తవమని ఆలయ ఈఓ జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి నల్లగొండ మండలం దండంపల్లి శివారులో 52.24 ఎకరాల భూమి ఉందని పేర్కొన్నారు. ఆ భూమిని కౌన్నేళ్లుగా రైతులకు వేలం ద్వారా కౌలుకు ఇస్తున్నట్లు తెలిపారు. ఆ భూమిని అమ్మకానికి వేలం వేస్తున్నట్లు కొందరు వ్యక్తులు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.

బెస్ట్ సర్వీస్ ఫర్ సొసైటీ అవార్డుకు రుణాదేవి ఎంపిక

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్ సంక్షేమ అధికారి దాసరి రుణాదేవికి బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అందించే బెస్ట్ సర్వీస్ ఫర్ సొసైటీ జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ అవార్డు సెలక్షన్ ఆహ్వాన పత్రాన్ని ఆమెకు అందించారు. జూన్ 10న మహారాష్ట్రలోని పూణేలో జరుగనున్న సమావేశంలో ఈ అవార్డు ను తనకు అందించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

- లేచిపోయిన ఇంటి పైకప్పులు



ఎగిరిపోయిన ఇంటిపైకప్పు

చందంపేట : మండలంలోని పాత కంబాలపల్లి గ్రామంలో మంగళవారం వీచిన ఈదురు గాలుల బీభత్సానికి పలువురి ఇంటిపైకప్పులు ఎగిరిపోయాయి. గ్రామానికి చెందిన పులిమల యేసోబు, ఆడెపు చంద్రమ్మ, గోసంగి దేవసాని, కొమ్ము వెంకటయ్యల ఇంటి పైకప్పులు ఎగిరిపోయినట్లు బాధితులు తెలిపారు ఒక్కొక్కరి ఇంటికి సంబంధించి రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



దేవరకొండ : ఫర్టిలైజర్ దుకాణదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ

దేవరకొండ : ఫర్టిలైజర్ దుకాణదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని దేవరకొండ ఏడీఏ శ్రీలక్ష్మీ అన్నారు. మంగళవారం దేవరకొండ మండల పరిధిలోని కొండభీమనపల్లి రైతు వేదికలో దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము,డిండి మండలాల పరిధిలోని ఫర్టిలైజర్ దుకాణ దారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్ల నిర్వహణతో పాటు రోజు వారిగా రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువులకు సంబంధించిన అన్ని వివరాలను రిజిస్టర్లలో పొందుపర్చాలని ఆమె సూచించారు. అందులో భాగంగా రైతు పేరు, తండ్రి పేరు, సెల్ నంబర్, ఏ రకం విత్తనాలు, ఎన్ని ప్యాకెట్లు కొనుగోలు చేశారన్న వివరాలు తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో దేవరకొండ ఏఓ రవికుమార్, ఏఈఓలు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

చింతపల్లి : మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్, కుర్మేడు ప్రధాన కూడళ్లలోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి శ్రావణకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైసెన్స్ లేని దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయకూడదని కోరారు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి రశీదు పొందాలన్నారు. లూజ్ పత్తి విత్తనాలను విక్రయించరాదని సూచించారు.



మాడుగులపల్లి : విత్తనాల ప్యాకెట్‌పై ముద్రించిన వివరాలు పరిశీలిస్తున్న ఏఓ సైదానాయక్



మాల్‌వెంకటేశ్వరనగర్‌లో ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి

మాడుగులపల్లి : ఎమ్మార్పీకే రైతులకు పత్తి విత్తనాలు విక్రయించాలని ఏఓ సైదానాయక్ సూచించారు. మండలంలోని విత్తనాల దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పత్తి విత్తనాల ప్యాకెట్లపై ధర, లేబుళ్లు, ఇతర వివరాలతోపాటు రికార్డులను పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల వివరాలను రికార్డుల్లో పక్కాగా నమోదు చేయాలని వ్యాపారులకు సూచించారు. ఎరువులు, విత్తనాల ధరలు దుకాణం ఎదుట స్టాక్ బోర్డుపై ప్రదర్శించాలని చెప్పారు. ఎవరైనా నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేప్పుడు అన్ని వివరాలు సరి చూసుకోవాలన్నారు. అవసరం అయితే వ్యవసాయాధికారుల సాయం తీసుకోవాలని సూచించారు.

వివాదాస్పద స్థలంలో కట్టడాలు నిలిపివేయాలి

నాంపల్లి : నాంపల్లి మండల కేంద్రంలోని ఎస్‌బీహెచ్ ఎదురుగా ఉన్న వివాదాస్పద స్థలంలో చేపట్టిన కట్టడాలను వెంటనే నిలిపివేయాలని దేవరకొండ డివిజన్ పంచాయతీ అధికారి మోహన్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. వివాదంలో ఉన్న స్థలం విషయమై కోర్టులో కేసు నడుస్తోందని, అయినా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఓ వర్గం వారు ఇటీవల కలెక్టర్, డీపీఓకు ఫిర్యాదు చేశారు. డీపీఓ ఆదేశాల మేరకు మంగళవారం డీఎల్‌పీఓ గ్రామ పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఆ స్థలాన్ని పరిశీలించారు. ఇరువర్గాల వద్ద ఉన్న భూమి పత్రాలను పరిశీలించారు. కేసు కోర్టులో సాగుతున్నందున ఈ స్థలంలో ఇరువర్గాల వారు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని, వారి నుంచి ఆదేశాలు వచ్చేంత వరకు నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి గంజి వెంకటేశ్, సీనియర్ అడ్వకేట్ ఆకుల వెంకటరమణ, అంబేద్కర్ యువ కేంద్రం జాతీయ అధ్యక్షుడు గాలేంక గురుపాదం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గేర నర్సింహ, కత్తి కృష్ణారెడ్డి, శ్రీను తదితరులు ఉన్నారు.



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ మోహన్‌రావు

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు నిరంతరం కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సెయింట్ మేరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షిం చారు. అనంతరం పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమం లో నేరేడుగొమ్ము ఎంపీపీ బిక్కునాయక్, బాబురాం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చెరువు శిఖం భూములు కబ్జా చేస్తే చర్యలు



పందిర్లపల్లి చెరువును పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు



ఆక్రమణకు గురైన అవంతీపురం నల్లకుంట చెరువును పరిశీలిస్తున్న వస్కుల మట్టయ్య

- మిర్యాలగూడ ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ : చెరువు శిఖం భూములు కబ్జా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ జి.శ్రీనివాస్‌రావు హెచ్చరించారు. మంగళవారం మిర్యాలగూడ మండం యాద్గార్‌పల్లి గ్రామంలో గల పందిర్లపల్లి చెరువును క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం పందిర్లపల్లి చెరువును పరిశీలించి అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న జేసీబీని సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా భూములను ఆక్రమిస్తున్న ఇరువురు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. డివిజన్ పరిధిలోని చెరువులన్నింటిని త్వరలోనే సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని డీఐ, మండల సర్వేయర్‌ను, ఇరిగేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. చెరువు శిఖం భూములను ఆక్రమిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అదేవిధంగా మండలంలోని రుద్రారం గ్రామంలోని రుద్రప్ప చెరువు మొత్తం 360 ఎకరాలు కాగా చెరువును సర్వే చేయించగా సుమారు 120 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. ఈ చెరువు శిఖం భూములను ఆక్రమించిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రుద్రప్పచెరువుకు హద్దులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ విజయలక్ష్మీ, ఆర్ఐలు ఠాగూర్, రామకృష్ణ, సత్యనారాయణ ఉన్నారు.

చెరువు శిఖం భూములను కాపాడాలి

మిర్యాలగూడ : మండలంలోని యాద్గార్‌పల్లి పందిర్లపల్లి చెరువు, రుద్రారం గ్రామంలోని రుద్రప్ప చెరువు, అవంతీపురంలోని నల్లకుంట చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయని వెంటనే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య అధికారులను కోరారు. మంగళవారం ఆయన కబ్జాకు గురైన ఆయా గ్రామాల్లోని చెరువు శిఖం భూములను ఆయన పరిశీలించి మాట్లాడారు. రామచంద్రగూడెం ఆర్‌అండ్‌బీ నుంచి యాద్గార్‌పల్లి బోటింగ్ పార్క్ వరకు నెక్లస్ రోడ్డు వేసేందుకు చెరువు శిఖం భూమి నుంచి రహదారి నిర్మాణం చేపట్టారు. దీన్ని ఆనుకోని ఉన్న కొందరు గృహాల వారు చెరువు శిఖం భూములను ఆక్రమించుకోని కంచె వేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చెరువు శిఖం భూములకు హద్దులు నిర్ణయించి అక్రమార్కులు కబ్జా చేయకుండా కాపాడాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి



మాడుగులపల్లి : ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు



త్రిపురారం : ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

మిర్యాలగూడ : పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలను చెల్లించాలని సీఐటీయూ దామరచర్ల మండల కన్వీనర్ భైరం దయానంద్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు 6, 7నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం జీతాలను వెంటనే విడుదల చేసి పీఆర్‌సీని అమలు చేయాలని జీఓ నెం.51ను సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి శ్రీరాములు, జహీర్, ఎ.సైదులు, బంటు నాగయ్య, నాగమల్లయ్య, మేరమ్మ, జాలమ్మ పాల్గొన్నారు.

త్రిపురారం : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను అధికారులు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోలె సాంబయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పంచాయతీ కార్మికులతో కలిసి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపీఓ రాజేందర్‌కు వినతిపత్ర అందజేసి మాట్లాడారు. జిల్లా అధికారులు స్పందించి పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించకపోతే జూన్ నెలలో డీపీఓ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవోజు సురేష్, అల్లాడి శ్రీను, ముత్తమ్మ, గోరుటి మహేష్, చింతకుంట్ల వెంకన్న, ముదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జంపాల సైదలు, బ్రహ్మాచారి, పామనాచారి, మహేష్ పాల్గొన్నారు.

మాడుగులపల్లి : పారిశుధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పది నెలలుగా వేతనాలు సక్రమంగా అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు దక్కాల్సిన ప్రయోజనాలు, ఇవ్వాల్సిన సామగ్రిని సైతం ఇవ్వడం లేదని మండిపడ్డారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. వినతిపత్రాన్ని ఎంపీడీఓ స్వామికి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండలాధ్యక్షుడు కొండేటి నర్సయ్య, కార్యదర్శి యాదమ్మ, కార్మికులు వెంకటయ్య, జానయ్య, శ్రీను, పూలమ్మ, సునీత, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం ఎన్టీఆర్‌కు నివాళి



మిర్యాలగూడ టౌన్ : ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



దేవరకొండ : ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మహోన్నతమైన వ్యక్తి ఎన్‌టీ రామారావు నేటికి ప్రజల గుండెల్లో జీవించే ఉన్నారని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు 101వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధీరావత్ స్కైలాబ్‌నాయక్, పాతూరి ప్రసాద్, చలపతిరావు, సరికొండ రామకృష్ణంరాజు, గాలం వెంకన్న తదితరులున్నారు.

కమ్మ సంఘం ఆధ్వర్యంలో..

పట్టణ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సాగర్ రోడ్డు ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఆన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు. అనంతరం లయన్స్‌క్లబ్ ద్వారా కమ్మ సంఘం సహకారంతో ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఆల్పహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ సీడి రవికుమార్, ఆ సంఘం నాయకులు వెంకటేశ్వర్‌రావు, సురేష్, పరిమి రామావతారం, కృష్ణ, అబ్బుర్, ప్రసాద్, తదితరులున్నారు. అలాగే టీడీపీ పట్టణ అధ్యక్షులు వడ్డె బోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం నందమూరి తారకరామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా బస్టాండ్ వద్ద ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు.

దేవరకొండ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 101వ జయంతిని మంగళవారం దేవరకొండ పట్టణంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపార్టీ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వస్కుల కృష్ణయ్య ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అభిమానులు కోతి అమరేందర్‌రెడ్డి, సీతారాములు ఉన్నారు.

బస్టాండ్‌లో ప్రయాణికులకు అవస్థలు

- మరుగుదొడ్లకు నీటి వసతి కరువు
- మరమ్మతులకు గురైన విద్యుత్ మోటారు

హాలియా : హాలియా ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లకు మూడు రోజులుగా నీటి సరఫరా లేక ప్రయాణికులు, మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు టాయిలెట్స్‌కు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాలియా ఆర్టీసీ బస్టాండ్‌లో మరుగుదొడ్లకు నీటిని అందించేందుకు విద్యుత్ మోటారును ఏర్పాటు చేశారు. బోరు మోటారు ద్వారా బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లకు నీటి సరఫరా జరుగుతుంది. అయితే గత మూడు రోజుల క్రితం నీటిని సరఫరా చేసే విద్యుత్ మోటర్ మరమ్మతులకు గురికావడంతో ఆ మోటారును పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

మహిళలకు ఇబ్బందులు

నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్, మాచర్ల, ఖమ్మం, మంత్రాలయం, భద్రచలం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సులు హాలియా ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోకి రావాల్సిందే. ఆయా ప్రాంతాలు మాత్రమే కాకుండా వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ప్రధాన కూడలిగా హాలియా పట్టణం ఉంటుంది. హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, భద్రాచలం, మంత్రాలయం, దేవరకొండ, నాగార్జున సాగర్, మాచర్ల పట్టణాలకు వెళ్లేందుకు హాలియా బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఇటీవల ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టినప్పటి నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. విద్యా, ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉన్న తమ పిల్లలను కలవడానికి వారంలో ఒకరోజు తల్లులు వెళ్తున్నారు. కానీ అత్యవసర పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. కానీ కనీస అవసరాలను తీర్చుకోవడానికి మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులకు గురైన మోటరును బాగు చేయించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నీటి సరఫరా లేక తాళం వేసి ఉన్న మరుగుదొడ్లు

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

పెద్దఅడిశర్లపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని దేరకొండ డీఎస్పీ గిరిబాబు సూచించారు. మంగళవారం పెద్దఅడిశర్లపల్లి మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డులోని నయారా పెట్రోల్ బంక్ వద్ద గల డేంజర్ స్పాట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి వాహనాలలో ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట సీఐ ధనుంజయ్యగౌడ్, ఎస్ఐ నర్సింహులు తదితరులున్నారు.



డేంజర్ స్పాట్‌ను పరిశీలిస్తున్న దేవరకొండ డీఎస్పీ గిరిబాబు